నేడు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 6 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం యాగశాల వైదిక కైంకర్యములు, చూర్ణోత్సవం, శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపనం, చక్ర స్నానం పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, కుంభసమారోపణం, బ్రహ్మ గోష, యజమాన మహాదాశీర్వచనం పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు మూడుపూటలా అన్న సమారాధన నిర్వహిస్తూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా వేడుకలు సాగుతున్నాయి. శుక్రవారం శ్రీపుష్పయాగము, శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఈఎంఈ సెయిలింగ్ పోటీలు షురూ..

సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ)/ హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్మీకి చెందిన ఈఎమ్‌ఈ వార్షిక సెయిలింగ్ రెగెట్టా చాంపియన్‌షిప్‌నకు తెరలేచింది. ద క్రాప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్(ఈఎంఈ) సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్‌లో సెయిలింగ్ పోటీలను లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్‌నాయ్ ప్రారంభించారు. సెయిలింగ్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రాప్స్ ఆఫ్ ఈఎంఈ సెయిలింగ్ రెగెట్టా -2024 పోటీల వివరాలను వెల్లడించారు. సెయిలింగ్ ద్వారా టీమ్ వర్క్ అభివృద్ధి చెందడంతో పాటు ఆలోచన విధానం మారుతుందని నీరజ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- కూకట్‌పల్లిలో జోరుగా బడిబాట
- విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న హెచ్ఎం గురాచారి, ఏఏపీసీ చైర్మన్ చంద్రకళ, ఉపాధ్యాయులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన ఉంటుందని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు గురాచారి అన్నారు. గురువారం కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన వసతులు కల్పించడంతోపాటు ఉచితంగా విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందించడం జరుగుతుందని, తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. ఒత్తిడిలేని విద్య కోసం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రకళ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

మూసాపేటలో...

మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఎఏపీసీ చైర్మన్ హేమలతలు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం జరుగుతుందని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

సందడిగా బడిబాట

అల్లాపూర్, జూన్ 6 : నూతన విద్యా సంవత్సరం (2024-25)ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పించే మహోన్నతాశయంతో ప్రభుత్వం ఈ కార్యక్రమంలో చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావునగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన టీచర్లు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉచితంగా పౌష్టికాహారం అందజేసే విషయాన్ని తల్లిదండ్రులకు వివరిస్తూ, ఆట పాటలు, పిల్లలను భద్రంగా చూసుకునే తీరుతెన్నులను వారికి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు జయశ్రీ, రాధ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు నాగుల సత్యం, వి.రఘుపతి, కె.సత్యనారాయణ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు వివరిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాటలో పాల్గొన్న హెచ్ఎం కృష్ణయ్య, ఏఏపీసీ చైర్మన్ హేమలత, ఉపాధ్యాయులు

చిరు వ్యాపారుల పొట్టగొట్టడం సరికాదు

బాలానగర్, జూన్ 6: జీహెచ్ఎంసీ అధికారులు డబ్బాలు తొలగించి చిరు వ్యాపారుల పొట్టగొట్టడం హేయమైన చర్య అని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్ ప్రధాన రహదారిపై గత కొన్నేండ్లుగా ఉన్న డబ్బాలు, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేశారని అందిన సమాచారం మేరకు కార్పొరేటర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అధికారులు కనీసం ఆలోచన చేయకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ నేతల కనుసన్నల్లో పని చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ఎవరిపైనా కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు.

ఇందిరానగర్‌లో కూల్చి వేసిన డబ్బాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసి సమస్యలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

దుండిగల్, జూన్ 6 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గురువారం కృష్ణను శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

- ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు ఆహ్వానం

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు దంపతులకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

దుండిగల్, జూన్ 6 : ఈనెల 8వ తేదీన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 26వ డివిజన్‌ల పరిధి, శ్రీనివాస నగర్‌లోని శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుతా..

బాధితుడికి జీతం డబ్బులను అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 6: కష్టపడి పని చేసే కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, బాధిత కార్మికుల హక్కుల కోసం ఎల్లప్పుడు పోరాడుతానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. మియాపూర్‌లోని పల్కో సెక్యూరిటీస్ ఆఫీస్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేసిన ప్రతాప్ ఇటీవలే పని మానేశాడు. అతడికి రావాల్సిన రెండు నెలల జీతం డబ్బులను సెక్యూరిటీస్ సంస్థ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నది. బాధితుడైన ప్రతాప్ కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించగా.. గురువారం సెక్యూరిటీ సంస్థ నిర్వాహకుడితో మాట్లాడి ప్రతాప్‌కు రావాల్సిన జీతాన్ని ఇప్పించాడు. దీంతో నేతలకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

విజేతగా పవర్‌హిట్టర్స్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అత్తాపూర్‌లోని స్టైయిట్ డ్రైవ్ వేదికగా జరిగిన బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్(బీసీపీఎల్)లో పవర్‌హిట్టర్స్ టీమ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో పవర్‌హిట్టర్స్..పూర్‌బాయ్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పూర్‌బాయ్స్ 7 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 40 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పవర్‌హిట్టర్స్ 6.5 ఓవర్లోనే విజయాన్నందుకుంది. సూపర్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న శంకర్‌సింగ్ రాజ్‌పుత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ముగింపు కార్యక్రమానికి అజయ్‌కుమార్ అగర్వాల్, అమ్రిత్‌కుమార్, అరుణ్‌కుమార్, వేద్‌ప్రకాశ్ హాజరయ్యారు.

ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా విజయం సాధించిన ఈటల రాజేందర్‌కు కూకట్‌పల్లి జనసేనా ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, జనసైనికులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఈటల నివాసానికి వెళ్లిన జనసైనికులు శాలువాతో సన్మానించి... పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో జనసేనా నేతలు కొల్లా శంకర్, మహేశ్, లక్ష్మణ్, ప్రసాద్, షణ్ముఖ, రఘు, లక్ష్మి, సత్య, రాధిక, జానవి తదితరులు ఉన్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 6

మహా అన్నదాన ప్రసాదం

శ్రీ వాసవి సేవాదళ్ సుచిత్ర కొంపల్లి ఆధ్వర్యంలో గురువారం అమావాస్య సందర్భంగా 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ మిత్రులు పడకంటి వెంకటేశం, తోట భిక్షపతి, పల్ల నాగరాజు, ఉప్పల నాగరాజు, గిరిధర్, చీల రాము, ఉప్పల రాము, రమేశ్, దొంతుల శ్రీనివాస్, మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- కుత్బుల్లాపూర్, జూన్ 6

యువతి అదృశ్యం

పార్వతి(ఫైల్)

దుండిగల్, జూన్ 6 :ఓ యువతి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాష్‌నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్పకు చెందిన ఎం.సత్యవతి, రమణ దంపతులు. వీరికి ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు. కొడుకు పెండ్లి కావడంతో భార్యతో కలిసి వేరే చోట ఉంటుండగా.. కూతురు పార్వతి(21)తో కలిసి సత్యవతి, రమణ ఉంటున్నారు. దంపతులు ఇద్దరు రోజూవారి కూలీ పనులు చేసుకుంటూ ఉపాధిని పొందుతుండగా.. పార్వతి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఐదురోజుల సత్యవతి, రమణ కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కూతురు పార్వతి కన్పించలేదు. దీంతో ఆందోళనకు గురైన దంపతులు పార్వతి ఆచూకీ కోసం చుట్టు పక్కల వెతకడంతోపాటు బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో గురువారం సూరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుండిగల్ పీహెచ్‌సీని జీహెచ్ఎంసీలో కలపాలని వినతి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో చర్చిస్తున్న ఆశావర్కర్లు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు తీర్థప్రసాదాలను అందజేస్తున్న పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, జూన్ 6: దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీహెచ్ఎంసీ పరిధి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆశావర్కర్లు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వెలిబుచ్చారు. నియోజకవర్గంలో గర్భవతులు ప్రసూతి కోసం నీలోఫర్ ఆసుపత్రి లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కుత్బుల్లాపూర్‌లో ప్రసూతి ఆసుపత్రి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెల్లారు. దీంతో ఆయన స్పందిస్తూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కుత్బుల్లాపూర్‌లో ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్, జూన్ 6 : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గురువారం తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక అర్చనలతో చేసిన తీర్థప్రసాదాలను అభిమానులు అందించారు. అనంతరం పలు సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులతో చర్చించి, సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి

ఘనంగా సీఆర్ జయంతి

మాదాపూర్, జూన్ 6: చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సందర్భంగా గురువారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి విచ్చేసి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సీ పి.జె చంద్రశేఖర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఆరోగ్య కేంద్ర డైరెక్టర్, డాక్టర్ కె.రజిని, ఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి, తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శి వి.రత్నాకరరావు, మహిళా సంక్షేమ కేంద్రం ప్రిన్సిపాల్ కల్పన, ఆరోగ్య కేంద్ర సీఈఓ విజయలక్ష్మి, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు, డాక్టర్ పి.సరస్వతి తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

Public is hereby informed that my Clients Sri. Pallapu Tirumal, S/o. Venkaiah, Age: 24 years and Smt. Pallapu Sheshamma W/o. Pallapu Venkaiah, Age: 44 years, both are R/o. Plot No. 29, Subhash Nagar, Jeedimetla, Quthbullapur, Medchal Malkalgiri District, Hyderabad-500055, intend to purchase a Semi-Finished House on Plot No. 339/Part (South Side Part), admeasuring 100.0 Sq.yards. or 83.6 Sq. Mtrs. (out of 200.0 Sq. yards), with a Plinth area 2700 Sft., of RCC (900.0 Sft. in Ground Floor + 900.0 Sft. in First Floor + 900.0 Sft. In Second Floor), in Survey Nos. 245, 309, 310 and 311, covered under Block No.7, situated at Subash Nagar of Jeedimetla village, Quthbullapur Mandal, under GHMC limits, Medchal-Makajgiri District, Telangana State bounded by: North: Plot No. 339/Part; South: Plot No. 338; East: 30'-0" Wide Road; West: Plot No. 322 from Sri. Mutyala Venkateswara Rao and Smt. Mutyala Jhahnavi Sri Sony, R/o. Plot No. 338/B, Subhash Nagar, Jeedimetla, Quthbullapur, Medchal-Malkajgiri District, Hyderabad-500055. Public is hereby further informed that if anybody have any sort of objection for the above sale deal or anybody has any interest, title, right or claim in the above said property they can Inform me or can meet me with proofs at the below given address or can call me within 10 days.

Sd/- K. HARI BABU, Advocate
HNo.4-32-41/130/58/A, Sainagar (W), Near Allwyn Colony, Kukatpally (PO) Hyderabad-500072 Ph.No. 9948108151

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మియాపూర్, జూన్ 6 : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీనగర్ రోడ్డు నంబర్ 1, 4లలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా పకడ్బందీగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, అంజయ్య, బాలరాజు, రమేశ్, పోశెట్టి, రాజేందర్, పదయ్య, పోచయ్య, రాజు, తాత బాబు తదితరులు పాల్గొన్నారు. గురువారం ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్ సాయిబాబ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

గాలివానతో విరిగిన చెట్లు..

దుండిగల్,జూన్6: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది.వర్షం ఓ మోస్తారుగానే కురిసినప్పటికి ఉరుములు,మెరుపులతో జనం భయభ్రాంతులకు గురయ్యారు.అదే సమయంలో బలమైన ఈదురుగాలులు వీయడంతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి,బాచుపల్లి-గండిమైసమ్మ ప్రధాన రహదారిలోని డా.రెడ్డీస్ ల్యాబ్ సమీపంలోని భారీ వృక్షాలు విరిగి నేలకూలాయి. కూలిన చెట్లు రోడ్డుపై పడటంతో వాహణాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది.

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి,బాచుపల్లి-గండిమైసమ్మ ప్రధాన రహదారిలోని డా.రెడ్డీస్ ల్యాబ్ సమీపంలో రోడ్డుపై కూలిన వృక్షం

యువకుడు ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జూన్ 6: విలాసవంతమైన జీవితం కోసం తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాధించలేనని విరక్తి చెంది సూసైడ్ నోట్ రాసి ఓ గుర్తుతెలియని మందు సేవించిన ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ విజయవాడకు చెందిన జాస్తిమని సాయి(25) గత కొన్నేండ్ల కిందట ఒక్కడే నగరానికి వలస వచ్చాడు. కుత్బుల్లాపూర్‌లోని శ్రీరామ్‌నగర్‌లో ఉంటూ చిన్నగా స్క్రాబ్ వ్యాపారం చేసుకుంటున్నాడు. కొన్ని ఆర్థిక ఇబ్బందులతో నిత్యం మనస్థాపం చెందేవాడని, దీంతో జీవితంలో డబ్బులు సంపాదించలేనని మనస్థాపంతో సూసైడ్ నోట్ రాసుకొని ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. అదే ప్రాంతంలో ఉన్న వరుసకు సోదరుడు పాండురంగబాబు సాయికి ఫోన్ చేయగా..ఎంతకు తీయకపోవడంతో తన రూంకు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితిలో పడి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా.. మృతుడి నోట్ల నుండి తెల్లటి ద్రవం బయటకు వచ్చి ఉన్నాదని తెలిపారు. గాంధీ మార్చురీకి తరలించి సోదరుడు పాండు రంగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.